ong-5_ong-5.qxd 2/15/2026 11:54 PM Page 1



## శ్రీ హరిహర క్షేత్రంలో మహా శివరాత్రి వేడుకలు

**చీమకుర్తి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**





మహా శివరాత్రి పర్వ దినం పురస్కరించుకొని బుధవారం చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో జరిగిన విశేష హోమాలు, అభిషేకాలు జరిగాయి. మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు దంపతుల అధ్వర్యంలో ఆదివారం ఉదయం మహా శివరాత్రి సందర్భంగా శ్రీ పార్వతి సమేత శ్రీ నగరేశ్వర స్వామి వారికి మహాన్యాసక పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహా లింగార్చన, రుద్ర హోమం నిర్వహించి అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా హరిహర క్షేత్రం శివ నామ స్మరణతో సాక్షియాత్తు కైలాసాన్ని తలపించింది ఆదివారం సాయంత్రం మహా శివరాత్రి పర్వదిన సందర్భముగా శ్రీ హరిహర క్షేత్రం నందు వేంచెసి వున్న శ్రీ పార్వతీ సమేత శ్రీ నగరేశ్వర స్వామి వారికి ,శిద్దా రాఘవ రావు దంపతులు, శిద్దా పాండురంగారావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ దంపతులు ఆలయంలో వేంచేసి వున్న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవదేవుని వారి ఆశిస్సులు అందుకున్నారు. రాత్రి శ్రీ హరిహర క్షేత్రంలో ఆలయ అర్చకులు హరికృష్ణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన గణపతి పూజ, మండపారాధన, మహన్యశక పఠనం, శతరుద్రీయ (121) రుద్రములతో సుగంధ ద్రవ్య, పంచామృత, ఫల, రస, అభిషేకములు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి స్వామి వారికి జ్యోతిర్లింగార్చన, లింగోద్భవం నిర్వహించారు. తదుపరి, మంగళహారతి, మంత్ర పుష్పము అత్యంత భక్తిశ్రద్ధలతో వేద పండితులు నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా క్షేత్రం లో వేంచేసి ఉన్న సకల ఆలయాలు విశేష పూలతో అలంకరించారు.. ఆలయ ప్రాంగణం రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం అందచేసారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ, హరికృష్ణ శర్మ, హరి వెంకట కుమారాచార్యలు భక్తులకు తీర్థప్రసాదాలు అందచేసారు. శిద్దా కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు అందచేశారు.

## శివనామ స్మరణతో మార్మోగిన రామతీర్థం

**చీమకుర్తి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**



దక్షిణ కాశిగా పేరొందిన రామతీర్థం పుణ్యక్షేత్రం శివనామస్మరణతో మారుమోగింది. మహాశివరాత్రి పర్వదినం జరుపుకోవడానికి, మహా శివుని దర్శించుకోవడానికి వేలాదిగా భక్తులు ఆదివారం తరలివచ్చారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి అభిషేకాల నిమిత్తం క్యూ లైన్ లలో ఎదురు చూశారు. రామతీర్థం పుణ్యక్షేత్రంలోని మోక్ష రామలింగేశ్వర స్వామి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి దర్శనం భక్తులు హాజరయ్యారు. మునుపు ఎన్నడూ లేని విధంగా పటిష్టమైన





క్యూలైన్లను నిర్మించడంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో రజిని కుమారి, చీమకుర్తి సిఐ డి. ప్రసాద్, తహసిల్దార్ ఆర్ బ్రహ్మయ్య ల సారధ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేపట్టారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్, మాజీ మంత్రి, సంతనూతలపాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ మేరుగ నాగార్జున మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మార వెంకారెడ్డి, పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీకృష్ణదేవరాయ కాపు అన్నదాన సత్రం, కాకతీయ కమ్మ అన్నదాన సత్రం, యోగివేమన రెడ్డి అన్నదాన సత్రం ఇతర అన్ని కులాల అన్నదాన సత్రాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

## దాతలు ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదాన వేడుకలు

**సంతనూతలపాడు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**



టంగుటూరు మండలం జమ్ములపాలెం లోని 1116 శివలింగాల ఆలయంలో నిర్వాహకులు పాదర్తి వీరబ్రహ్మం ఆధ్వర్యంలో అమ్మవారి భక్తులైన దాతలు మర్రి రవీంద్ర, మట్టుపల్లి అజయ్ కుమార్ ల చే మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా సుమారు 5 వేల మందికి పైగా భక్తులకు భారీ ఎత్తున అన్నదాన వేడుకలు నిర్వహించారు. ముఖ్యంగా ఐక్యత వెల్ఫేర్ సొసైటీ వారి సహకారంతో ఈ అన్నదాన వేడుకలు నిర్వహించారు. సంతనూతలపాడు వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్ నేతలు ఈ అన్నదాన వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడుకు చెందిన వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ వేమూరి నాగేంద్ర ప్రసాద్ రావు, వాసవి క్లబ్ గౌరవ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు వేమూరి నాగమణి, సెక్రెటరీ శిఘాకొల్లి జయ శ్రీ, కోశాధికారి జి. శ్రీలక్ష్మి., వాసవి మహిళా క్లబ్ మాజీ అధ్యక్షులు శిఘాకొల్లి విజయలక్ష్మి, వాసవి, క్లబ్, మహిళా క్లబ్ ప్రతినిధులు చుండూరి సృజన, చిన్ని కన్య, జి. రవి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తిన శివాలయాలు

**ఉలవపాడు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**



మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. చోళ రాజుల కాలం నాటి దక్షిణ కాశీగా పిలువబడుతున్న మన్నేటికోట శ్రీ పార్వతి సమేత అమరలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో అశేష భక్తజన సందోహంతో కిక్కిరిసింది. తెల్లవారుజాము నుంచే స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే కరేడు పంచాయతీలోని వాక గ్రామంలో వేంచేసియున్న బాలకోటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, జాగరణలతో శైవక్షేత్రాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

**వార్త**

## మహాశివరాత్రికి కిక్కిరిసిన ఒంగోలు బస్టాండ్

**ఒంగోలు కలెక్టరేట్ , ప్రభాతవార్త**



మహాశివరాత్రి సందర్భంగా కొటప్పకొండకు వెళ్లే భక్తులతో ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచే భారీగా భక్తులు బస్టాండకు చేరుకుని బస్సులకోసం ఎదురుచూస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. అయితే అంచనాలకు మించి భక్తులు రావడంతో బస్సుల కొరత ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడగా.. అదనపు బస్సులు ఏర్పాటుచేసే ప్రయత్నంలో అధికారులు ఉన్నారు.

# శివనామ స్మరణంతో మార్మోగిన శివాలయాలు..

**ఒంగోలు, ప్రభాతవార్త**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు భక్తజన సంద్రమైంది. అర్ధరాత్రి నుంచే వేలాదిమంది భక్తులు పవిత్ర శివాలయాలు దగ్గర పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఓం. నమ శివాయఖి మంత్రంతో క్షేత్రాలు మారు మ్రోగినవి. హిందువుల ప్రధాన పండుగలలో ఒకటైన మహాశివరాత్రి ఫిబ్రవరి 15, ఆదివారం నాడు భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, రాత్రి జాగరణలు నిర్వహించేందుకు దేవస్థానాలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు ఆచరించి, శివాలయాల్లో పాలు, తేనె, బెల్లం, గంగాజలంతో అభిషేకాలు నిర్వహించారు. బిల్వదళార్చన, రుద్రపఠనం, లింగార్చన ప్రత్యేకంగా జరుగుతాయి.

**పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల**

ఒంగోలులోని సంతపేటలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరం



వద్దనున్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ దంపతులు, సత్య దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అదే విధంగా ఒంగోలు కొండ మీద ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో





ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. మామిడిపాలెంలోని శ్రీసీతారామస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో మాగుంట పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తాతప్రసాద్, ఆత్మకూరు బ్రహ్మయ్య, ఆళ్ళ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.









# రాష్ట్రాన్ని గ్లోబల్ టూరిజం డిస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- పలువురు మంత్రులు
- అట్టహాసంగా పాకల బీచ్ పెస్టివల్ ముగింపు
- జనసంద్రంగా మారిన సాగర తీరం

**సింగరాయకొండ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

రాష్ట్రాన్ని గ్లోబల్ టూరిజం డిస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని పలువురు మంత్రులు తెలిపారు. ప్రకాశం జిల్లా పులకించిపోయేలా పాకల బీచ్ గడ్డపై రెండు రోజులపాటు నిర్వహించిన బీచ్ ఫెస్టివల్ అట్టహాసంగా ముగిసింది. రెండో రోజైన ఆదివారం వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో సాగరతీరం జనసంద్రంగా మారింది. సాంస్కృతిక కార్యక్రమాలు, హెలీ టూరిజం, వినోద ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సముద్ర తీరంలో నిర్వహించిన కళా ప్రదర్శనలు, సంగీత-నృత్య విభావరి, యువత కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వినోద కార్యక్రమాలు ఉత్సాహాన్ని నింపాయి. ఈ వేడుకలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, రోడ్లు భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మ్యారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మాల కార్పొరేషన్ చైర్మన్ పి. విజయ్ కుమార్, కలెక్టర్ పి. రాజాబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచిత్ర, కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ



అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పాకల బీచ్‌ను మరింత అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రజల సహకారం, అధికారుల సమన్వయంతో ఫెస్టివల్ విజయవంత మైందని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం అతిథులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను







అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ క్లాస్-4 ఉద్యోగాలు భర్తీ

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లాలో 2021-22, 2022-23 సంవత్సరాలలో పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల ప్రత్యేక బ్యాక్‌లాగ్ క్లాస్-4 ఉద్యోగాలు భర్తీ చేసిన కూటమి ప్రభుత్వం. మంత్రి స్వామి చొరువతో పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల ప్రత్యేక బ్యాక్‌లాక్ క్లాస్-4 ఉద్యోగాలు భర్తీ. ఉద్యోగాలు పొందిన నలుగురికి తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేసిన మంత్రి డీఎస్ బీవీ స్వామి. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలిపిన దివ్యాంగులు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు త్వరలోనే భర్తీ చేస్తాం అన్నారు. దివ్యాంగులకు ఉచితంగా త్రీవీలర్ మోటార్ బైక్‌లు పంపిణీ చేయనున్నాం అన్నారు. దివ్యాంగులకు వీల్ చైర్లు, సహాయ పరికరాలు, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం చంద్రబాబునాయుడు ఇంద్రధనుస్సు కార్యక్రమం తీసుకొచ్చారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం దివ్యాంగుల సౌకర్యార్థం రాష్ట్రంలోని అన్ని బస్టాండ్‌లలో వీల్ చైర్లు ఏర్పాటు చేస్తాం అన్నారు.

## నేటి ప్రజా సమస్యల వేదిక రద్దు

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నేడు జరగవలసిన ప్రజా సమస్యల వేదిక కార్యక్రమం పిజిఆర్ఎస్ ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు జిల్లాలోనే అధికారులందరూ పాకల బీచ్ ఫెస్టివల్ మరియు మహాశివరాత్రి ఉత్సవాలలో నిమగ్నమై ఉన్నందున మరియు మహాశివరాత్రి పండుగ సందర్భంగా సోమవారం ప్రభుత్వం ఐచ్చిక సెలవు ప్రకటించినందున సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల వేదిక కార్యక్రమం రద్దు చేయబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా నుండి వివిధ ప్రాంతాల ప్రజలు వచ్చే వీలున్నందున సదరు కార్యక్రమం రద్దు విషయాన్ని గమనించవలసిందిగా అధికారులు కోరారు.

## భక్తిశ్రద్ధలతో ఘనంగా మహాశివరాత్రి

**జె. పంగులూరు ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

జగమంతా శివతత్వం తోను. శివనామ సంకీర్తన భజనలతో నే నడుస్తుందని శ్రీ భారతి సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు చందలూరు సునీల్ శర్మ అన్నారు. మండలంలోని పలు శైవ క్షేత్రాలలో మహాశివరాత్రి పర్వదినం ఘనంగా నిర్వహించారు. ఓం నమశ్శివాయ నామస్మరణతో దేవాలయ ప్రాంగణాలు మొత్తం భక్తి పారవస్యంతో మునిగితేలాయి. పంగులూరు గ్రామంలో స్వయంభుగా వెలసి ఉన్న శ్రీ పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకులు చందలూరు సునీల్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగోద్భవ సమయంలో 11 రుద్రాలతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను ఆదివారం నిర్వహించారు.

# బీచ్ ఫెస్టివల్‌కు పోటెత్తిన ప్రజలు

- 2 లక్షలకు పైగా హాజరైనట్లు అంచనా
- హెలీ టూరిజం, సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తిన సాగర తీరం

**సింగరాయకొండ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**

మండలంలోని పాకల బీచ్ ఫెస్టివల్ రెండో రోజు ఆదివారం సముద్ర తీరం జనసంద్రంగా మారింది. రాష్ట్ర మ్యారీ టైం బోర్డు, పర్యాటక శాఖ సంయుక్తంగా ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన బీచ్ ఫెస్టివల్ ఘనవిజయాన్ని సాధించింది. ఈ వేడుకలు చరిత్రలో నిలిచిపోయేలా ప్రజాభిమానాన్ని సంపాదించాయి. హెలీ టూరిజం, రేస్ బోట్ రైడింగ్, వివిధ ప్రాంతాల ప్రత్యేక వంటకాలతో అలరించిన ఫుడ్ స్టాల్స్, బీచ్ స్పోర్ట్స్, హస్తకళల ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సముద్ర అలల హోరును తలదన్నేలా నిర్వహించిన సంగీత కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో సాగర తీరం కిటకిటలాడింది. ఈ ఫెస్టివల్ కు ముఖ్య అతిధిగా టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొని మాట్లాడుతూ లక్షలకు పైగా ప్రజలు హాజరైనట్లు వెల్లడించారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో వేడుకలు విజయవంతంగా నిర్వహించబడినట్లు తెలిపారు. హెలికాప్టర్ రైడింగ్‌కు విశేష స్పందన లభించడంతో సోమవారం కూడా హెలీ రైడింగ్ కొనసాగుతుందని నూకసాని బాలాజీ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.











## భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఎస్పీ

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. త్రిపురాంతకంలోని శ్రీపురాంతకేశ్వరస్వామి దేవస్థానం మరియు బాలా త్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి మహోత్సవాలు, అలాగే ఫిబ్రవరి 17 నిర్వహించనున్న రథోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదివారం అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఆలయ పరిసరాలు, ప్రవేశ మార్గాలు, క్యూలైన్లలో ఏర్పాటు చేసిన భద్రతా మరియు బందోబస్తు చర్యలను పరిశీలించారు. అదేవిధంగా దేవాలయం మరియు రథం వద్ద ఉన్న భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. దేవాలయం వద్ద భక్తులతో ఎస్పీ మాట్లాడి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఆలయ పరిసరాలను సందర్శించి, దర్శనానికి వచ్చే భక్తులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం క్యూలైన్లను క్రమబద్ధంగా నిర్వహించాలని, ఆలయం లోపల భక్తుల ప్రవేశం మరియు బయటకు వెళ్లే మార్గాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

6_6.qxd 2/16/2026 12:15 AM Page 1



# ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

**- శివనామస్మరణతో పులకించిన పల్లె సీమలు**




**బల్లికురవ, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్రంతో పల్లె సీమలు పులకించిపోయాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బ్రాహ్మీ ముహూర్త సమయం నుండి పచ్చని పల్లె లోగిళ్ళు శివనామస్మరణతో సూర్య భగవానుడికి స్వాగతం పలికాయి. మండలంలోని కొనిదెన, ఉప్పుమాగులూరు, బల్లికురవ, కొప్పెరపాడు, గుంటుపల్లి, అంబడిపూడి, కొండాయపాలెం గ్రామాలలోని శివాలయాలలో ప్రత్యేక అభిషేకాలు కొనసాగాయి. మాఘమాసంలో అమావాస్యకు ముందు రోజు శివరాత్రి వస్తుంది. అన్ని పండుగల్లోనూ చిట్టచివరిది మహాశివరాత్రి ఆడంబరాలు, ఆర్భాటాలు లేని ఒకే ఒక్క పండుగ శివరాత్రి. జన్మమొత్తం మీద ఒక్క సారి అభిషేకం చేసినా, శివపూజా చేసినా మోక్షాన్ని అనుగ్రహించేది మహాశివరాత్రి. పాతాళం నుంచిఅంతరిక్షం వరకు పద్నాలుగు లోకాలున్నాయి. దీనికి ఆవలిదైవ బ్రహ్మాండం అంతానిండి, ఆ పైన కూడా వ్యాపించి ఆవిర్భవిస్తున్న స్ఫటికలింగం దర్శనమిస్తోంది. దానిపై ఉన్న పున్నమి చంద్రునిలో నుంచి అమృతధారలు కురుస్తున్నాయి. ఆ మహాస్ఫటికలింగం అనంతం. అచలం ఏకైకం. అదే శివరూపం. రుద్రానువాకాలైన నమక చమకాలను జపిస్తూ, ధ్యానిస్తూ అభిషేకిస్తూ భక్త జనం తరించారు. భక్తుల కోరిన కోరికలన్నీ ఈ శుభదినాన నెరవేరుతాయి. ఎందుకంటే ఇది మహాశివరాత్రి. పరమేశ్వర స్వరూపం ఈ లింగమే. దీనికి జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఏమీ ఉండవు. నిలువుగా గుడ్డు ఆకారంలో ఆవిర్భవించిన మహాస్ఫటిక లింగం విశ్వశక్తి అయిన నిరాకార పరబ్రహ్మం తాలూకు సాకార దర్శనం. ఇది నిర్లిప్తం. శుద్ధం. గుణదోష రహితం. నింజనం నిర్వికారం. నిర్గుణ పరబ్రహ్మకు చిహ్నహే మహాశివరాత్రి నాడు ఆవిర్భవించే మహాలింగ స్వరూపంగా వేదోపనిషత్తులు, పురాణాలు వర్ణించే విశిష్ట పర్వదినం మహాశివరాత్రి. ఈ సందర్భంగా పలుచోట్ల ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది.

## దోర్నాలలో లీ-ఫార్మా, ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్టు ఉచిత వైద్య శిబిరం సేవలు ప్రశంసనీయం

**- మార్కాపురం సబ్ కలెక్టర్ శిరామిరెడ్డి**

**- మార్కాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాలయ్య అభినందనలు**



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

లీ-ఫార్మా, ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల సేవలు ప్రశంసనీయమని మార్కాపురం సబ్ కలెక్టర్ ఎం.శివరామిరెడ్డి, అసిస్టెంట్ఎక్సైజ్ సూపరింటెండెంట్ దాసరి బాలయ్య అన్నారు. రెడ్ల అన్నదాన కార్యక్రమం వద్ద దోర్నాల- శ్రీశైలం రోడ్డులో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపు రెండవ రోజు ఆదివారం విజయవంతంగా సాగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సేవాస్ఫూర్తితో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించబడుతుందని బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ మెగా ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న మార్కాపురం సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి మార్కాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాలయ్యలు మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం కాలినడకతో వెళ్లే భక్తులకు వాహనాలలో వెళ్లే భక్తులకు దారి ప్రయాణాలలో ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా రక్తపోటు, షుగర్, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. సేవాభావంతో ముందుకు వచ్చి భక్తులకు వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో వైద్య సేవలను వినియోగించుకున్నారు. క్యాంపు నిర్వహణలో వైద్యులు, ట్రస్టు సభ్యులు చురుగ్గా పాల్గొని శక్తివంచన లేకుండా నిస్వార్థ సేవలందించారు. బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి డాక్టర్ ఏలూరు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలు కొనసాగిస్తామని, సమాజ సేవకు ట్రస్టు కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మార్కాపురం కి చెందిన శ్రావణి ఆసుత్రి అధినేత డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, కందుల ఓబుల్‌రెడ్డి ఆసుపత్రి వైద్య సిబ్బంది భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శ తంగిరాల అశోక్‌రెడ్డి, పీఏసీసీ చైర్మన్ బట్టు సుధాకర్‌రెడ్డి, డాక్టర్ ఎన్‌వీబీఎల్ కిరణ్ కుమార్, ట్రస్టు సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చరిత్ర కలిగిన చారిత్రాత్మక అతి పురాతన పర్వత వర్ధిని సమేత వృచ్ఛికాల మల్లేశ్వరస్వామి దేవాలయం



**యర్రగొండపాలెం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం పట్టణం దపు వీరయ్యపాలెం గ్రామం రోడ్డు నందు గల చారినరతాత్మక శ్రీ పర్వత వర్ధిని సమేత వృచ్ఛికాల మల్లేశ్వరస్వామి వారి దేవాలయం శిధిలావస్థకు చేరి నిధుల వేటగాళ్ళ గునాపాల దెబ్బలకు కూలీ జీర్ణోద్ధరణకు నోచుకొని ఆలయం పాత శిల్పాకళాశైలి దెబ్బతినకుండగా యధాతధంగా పునరుద్ధరించడంతో కొతనత జీవం పోసుకుంది. దాతల సహాయ సహకారాలతో కమిటీ సభ్యుల కృషితో శతాబ్దాల నాటి శివాలయం సాంప్రదాయ పద్ధతిలో పునర్నిర్మించబడిన విషయం తెలిసిందే. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం శ్రీ పర్వత వర్ధినీ సమేత వృచ్ఛికాల మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో అంగరంగ వైభోవంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచే భక్తులతో ఆలయం కిక్కిరిసింది. ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో భక్తులు పాలొనగని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారి తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన వందల ఏళ్ల నాటి ఈ ఆలయం భక్తుల పరిరక్షణకు పునర్నిర్మించడంతో భక్తుల ఆనందాలకు అవధులు లేకుండా పోయింది. దాతల సహాయ సహకారాలతో అనతి కాలంలోనే శివాలయం జీవం పోసుకొని పూర్వ వైభవంలోకి వస్తుండడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పునర్నిర్మాణం గావించిన వృచ్ఛికాల మల్లేశ్వరస్వామి ఆలయం లోపల స్తంభాల మండపంలో నిలువెత్తు భారీ శిలలను ఉపయోగించి భారీ నంది విగ్రహాన్ని ప్రతిష్టించడంతో ఆలయం రూపురేఖలే మారిపోయి, ఆలయం సహజత్వం కోల్పోకుండగా ప్రత్యేక జాగ్రత్తలతో ఎకనకడ ఒక్క ఇటుకను ఉపయోగించకుండగా పూర్వపు గుడి కట్టడాల రాతినే ఉపయోగించడంతో ఆలయ పూర్వ వైభావానికి అంకురార్పణ జరిగిందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 18 ఏళ్లుగా పున:నిర్మాణ పనులు కొనసాగాయని ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయం క్రీ.శ కాలంలో ఈ స్తంభాల గుడిని నిర్మించినట్లు చరిత్ర చెబుతుందని ఆలయ ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యుల నిర్వాహకులు ఆవుల సత్యనారాయణ రెడ్డి తెలిపారు.

## పాలేటికొండ తాతగుడిని దర్శించుకున్న బుర్రా మధుసూదన్ యాదవ్



**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మండలం పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామం మహాశివరాత్రి పండుగ పర్వదినం సందర్భంగా మాజీ శాసనసభ్యులు, కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీఇన్‌చార్జి బుర్రామధుసూదన్‌యాదవ్ పాలేటికొండ తాత గుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అయ్యవారిపల్లి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనకు ప్రత్యేకంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. గుడి యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## 83 మంది బాధితులకు సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో 83 మంది బాధితులకు 52 లక్షల 60 వేల 196 రూపాయలు విలువ చేసే సీఎం రిలీఫ్ చెక్కులను ఎమ్మెల్యే విజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల టీడీపీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, తెళ్ళ మనోజ్ కుమార్, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు అలియాస్ పీఎస్‌ఆర్ సంతనూతలపాడు మండల టడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## స్కిన్ ఫర్ఫెక్ట్ హాస్పిటల్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో

**పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్**



**దర్శి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

గుంటూరులోని స్కిన్ పర్ఫెక్ట్ హాస్పిటల్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్. హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా డాక్టర్ సింధూర మన్నెకి అభినందనలు తెలియజేశారు.

## మైనంపాడులో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకలు

**- పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో తాము చదువుతున్న హైస్కూల్‌కు రెండు లక్షల రూపాయలు వ్యయంతో నిర్మింప చేసిన సాంస్కృతిక కళావేదిక మండపం**




**సంతనూతలపాడు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం మైనంపాడు హైస్కూల్లో ఆదివారం నాడు 1986 టూ 1991 సంవత్సరాలకు సంబంధించి పదవ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో తాము చదువుకున్న మైనంపాడు హైస్కూల్‌కు రెండు లక్ష రూపాయలు వ్యయంతో సాంస్కృతిక కళావేదిక మండపాన్ని నిర్మింపచేశారు. ఈ సందర్భంగా నేడు పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు తదితర రంగాల్లో నెలకొన్న ఉన్న అప్పటి పూర్వ విద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళన వేడుకలకు తరలివచ్చి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి పూర్వ ఉపాధ్యాయులైన లక్ష్మీ కటాక్షం, రామ్మోహన్, చిట్టిబాబు, రామారావు, జాహ్నవిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలను పూర్వ విద్యార్థులు సోమాసి శ్రీనివాసులు, మైనంపాటి సత్యవాణి, ఆకుల కోటయ్య తదితరులు పర్యవేక్షించారు. ఈ వేడుకల కార్యక్రమానికి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డీవీఎల్ నరసింహారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, పూర్వ విద్యార్థులు ఆల్ల శ్రీను, పోతినేని అనురాధ, పెరుగు రాజ్యం, కే.ప్రభాకర్, ఆకుల కోటేశ్వరరావు, శ్రీలత, మైనంపాటి నాగు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు దూర ప్రాంతాల నుండి ఈ ఆత్మీయ సమ్మేళన వేడుకలకు తరలివచ్చి ఆనందోత్సవాలను పంచుకున్నారు.

## హాస్టల్ బాత్‌రూమ్‌లో అనుమానాస్పదంగా విద్యార్థి మృతి

**- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ**



**సింగరాయకొండ,ఫిబ్రవరి 14, ప్రభాతవార్త**

పట్టణంలోని మూలగుంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు కనిగిరి మండలానికి చెందిన సయ్యద్ అలీ రెండవ కుమారుడు సయ్యద్ తౌశిక్ (11) మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని శ్రీ చైతన్య సైనిక్ నవోదయ పాఠశాలలో గత ఏడాది నుంచి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం స్నానం చేసేందుకు హాస్టల్ బాత్రూంలోకి వెళ్లిన తౌశిక్ చాలాసేపు బయటకు రాకపోవడం గమనించిన తోటి విద్యార్థులు బాత్రూం గదిలో అపస్మారక స్థితిలో కనిపించిన బాలుడిని చూసి పాఠశాల యాజమాన్యానికి తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాలుడిని సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడి మృతి వార్తతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురై పాఠశాల వద్ద మృతదేహంతో అర్ధరాత్రి వరకు ఆందోళన చేపట్టారు. ఆగ్రహంతో కొంత ఆస్తిని ధ్వంసం చేశారు. మా బిడ్డ మాకు కావాలి అంటూ బోరున విలపించారు. పాఠశాల యాజమాన్యం నిరక్ష్యమ్లే తమ కుమారుడి మృతికి కారణమని, ప్రధానంగా హాస్టల్ వార్డెన్ బాధ్యత వహించాలని ఆరోపించారు. ఘటన అనంతరం యాజమాన్యం పరారీలో ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు ఆదివారం తరలించారు. పోస్టుమార్టం పూర్తయిన వెంటనే కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

## సంగమేశ్వరుణ్ణి దర్శించుకున్న దామచర్ల సత్య




**పొన్నలూరు ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య దంపతులు మండలంలోని చెన్నిపాడు వద్ద గల సంగమేశ్వర దేవస్థానంలోని సంగమేశ్వరుడి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అభిషేక కార్యక్రమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన కాకతీయ కమ్మ, రెడ్డి అన్నదాన సత్రాలను సందర్శించారు. ఆయన వెంట మండల పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం కసరత్తు..!

**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం కసరత్తు నిర్వహిస్తోంది. ఈనెల 18న అధికారులతో సీఎం చంద్రబాబునాయుడు భేటీ కానున్నారు. మార్చిలోపు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుంది. మార్చిలోపు ఎన్నికలు పెట్టకపోతే కేంద్రం నుంచి వచ్చే రూ.498 కోట్లు రద్దు అయ్యే అవకాశం ఉంది. ఎన్నికల ఖర్చు ఎంత..? కేంద్రం నుంచి వచ్చే నిధులు ఎంత అనే విషయంపై ప్రభుత్వానికి వివరించనున్న అధికారులు.

## వెంకట సుబ్బయ్యకు నివాళులర్పించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు మండలం చేకూరపాడు గ్రామంలోని కొమ్మినేని వెంకట సుబ్బయ్య పెద్దకర్మ కార్యక్రమంలోసంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేబీఎన్ విజయ్‌కుమార్ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలువేసినివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు తెళ్ళ మనోజ్ కుమార్, నియోజకవర్గ రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, సర్పంచ్ కొమ్మినేని రమేష్, కొమ్మినేని హరీష్, గంగి రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఇష్టంతో చదివితే విజయం సులభం అవుతుంది



**సీఎస్‌పురం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

ఇష్టంతో చదివితే విజయం సులభం అవుతుందని, విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి ఫలితాలను సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని నెల్లూరు నేతాజీ విద్యాసంస్థల అధినేత, అంబవరం జడ్పీ హెచ్‌ఎస్ పూర్వ విద్యార్థుల సంఘం అధనయక్షులు ఎంవీ(నేతాజీ) సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా గత నెల రోజులుగా నిర్వహించిన పాఠశాల స్థాయి స్పోర్ట్స్ మీట్ పోటీలలో విజేతలకు ఎంవీ(నేతాజీ) సుబ్బారెడ్డి సహకారంతో మెడల్స్ సర్టిఫికేట్స్ బహుకరించారు. పూర్వ విద్యార్థి, రిటైర్డ్ విద్యుత్ లైన్‌ఇన్‌స్పెక్టర్ నేలటూరి వెంకటేశ్వరరెడ్డి పాఠశాలలోని ఆర్వో ప్లాంట్ కు ఆటోమేటిక్ వాటర్ కంట్రోల్ సిస్టంను, మరో పూర్వ విద్యార్థి బసివి హనుమంతరావు స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. దాదాపు 20 సంవత్సరాలుగా పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అమోఘమని, విద్యార్థులు శ్రద్ధగా చదివి మెరుగైన ఫలితాలను పూర్వ విద్యార్థులకు కానుకగా ఇవ్వాలని పొదిలి ఎంఈఓ నాగలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం షేక్ షరీఫ్‌లు అన్నారు. నేతాజీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో హెచ్‌ఎం షరీఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంబవరం ఏ .కొత్తపల్లి సర్పంచ్‌లు కొండయ్య, ముప్పాళ్ళ శ్యామలమ్మ, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి గుంటిమడుగు కృష్ణంరాజు, బైరవకోన మాజీ చైర్మన్ ముప్పాళ్ళ కృష్ణంరాజు, పూర్వ విద్యార్థులు భాస్కర్‌రెడ్డి, నేలటూరి వెంకటేశ్వరరెడినడ, గన్నవరం తిరుపతయ్య, పి.కృష్ణమూర్తి, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, కొండూరు మునిరాజు, నారాయణ రాజు, వెంకట రాజు, పాఠశాల సిబ్బంది కమ్మనేతి వెంకటేశ్వర్లు, నరేంద్ర భాషా, కరుణాకర్, షరీఫ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ




**దర్శి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పల్నాడు జిల్లా కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వస్వామి దేవస్థానంలో రాష్ట్రమంత్రులు గొట్టిపాటి రవికుమార్, వంగలపూడి అనితతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించిన దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి. ఈ ఆది దేవుడి కరుణా కటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి. ఈ సందర్భంగా ప్రజలందరికి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ వీప్ జీవి ఆంజనేయులు, స్థానిక శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు ఉన్నారు.

# హరహర మహాదేవ శంభో శంకర

**- శివనామ స్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు**



**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త**

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మార్కాపురం పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల శివనామ స్మరణతో మార్మోగాయి. ఆదివారం తెల్లవారుఝాము నుండే శైవ క్షేత్రాలకు వెళ్ళేందుకు భక్తులతో బస్టాండ్ ఆవరణం నిండిపోయింది. జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణం నుండి వివిధ శైవ క్షేత్రాలైన శ్రీశైలం, త్రిపురాంతకం, తిప్పాయిపాలెం తదితర శైవ క్షేత్రాల వరకు భక్తుల సౌకర్యార్థం ఎపిఎస్‌ఆర్టీసి వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. శ్రీశైలం వరకు పాదయాత్ర చేస్తూ వెళ్ళే భక్తుల కొరకు మధ్య మధ్యలో స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాల ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలు, వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా శైవ క్షేత్రాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్కాపురం పట్టణంలోని శివాలయంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సాసీపీ ఇంచార్జి అన్నా రాంబాబు, దుర్గాకుమారి దంపతులు మహాదేవుడు శివయ్యకు అభిషేకాది పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుతో పాటు పలువురు వైసిపి నాయకులు మార్కాపురం నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

# భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు



**లింగసముద్రం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా లింగసముద్రంలోని తిరుమనిశెట్టి కోటయ్య మందిరాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు 8 సంవత్సరాల నుండి నిర్విరామంగా పూర్వ విద్యార్థులు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం స్థానిక కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని (1997-2002) పూర్వ విద్యార్థులు భక్తులకు పులిహోర, పెరుగన్నం, మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమానినన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, జనసేన పార్టీ మండల అధ్యక్షులు అంగులూరి నరసింహారావు, బీజేపీ మండల అధ్యక్షులు మల్లే ఏడుకొండలు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్విరామంగా పూర్వ విద్యార్థులు శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తుల కొరకు అల్పాహార పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇలాగే ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి కందుకూరు నియోజకవర్గ జనసేన పార్టీ కోఆర్డినేటర్ బింకం నరేంద్ర, పూర్వ విద్యార్థులు చప్పిడి కొండలరావు, సంగా సురేష్, మునగల రాజశేఖర్, పున్నపు నరేష్, కన్నెపల్లి సురేష్, నున్న అనురాధ, వీఏఎస్‌లక్ష్మీ, అన్నంగి రజిని, సుంకరి నర్మద తదితరులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మార్మోగిన చిన్నగంజాం

**- మహాశివరాత్రి వేళ సోపిరాల ఆధ్యాత్మిక శోభ**

**- భక్తి వైభవం రామ రామకోటేశ్వర, బాలకోటేశ్వర సన్నిధిలో విశేష పూజలు**

**- ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**




**మార్టూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

పర్చూరు నియోజకవర్గంలోని చిన్నగంజాం మండలంలో మహాశివరాత్రి పర్వదినం వేడుకల్లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. సోపిరాల ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీరామ రామకోటేశ్వర స్వామి ఆలయం, కొత్తపాలెం గ్రామంలోని శ్రీ బాలకోటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులతో ఆధ్యాత్మిక ఈ ప్రాంతమంతా ఆధ్యాతిక శోభ సంతరించుకుంది.

**సోపిరాలలో మహాభిషేకాలు :**

మహాశివరాత్రి సందర్భంగా రుద్రాభిషేకం, బిల్వార్చన, లింగార్చన వంటి విశేష కార్యక్రమాలు వేద ఘోషాల మధ్య నిర్వహించారు. తెల్లవారు జామున నుంచే భక్తులు క్యూలైన్లలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరికి సుఖశాంతులు కలగాలని రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్ధించారు.

**కొత్తపాలెంలో బాలకోటేశ్వరునికి ప్రత్యేక అర్చనలు :**

కొత్తపాలెం గ్రామంలోని శ్రీ బాలకోటేశ్వర ఆలయంలో కూడా మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు వేద పండితులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. వేద మంత్రాల మధ్య ఆశీర్వాదాలు అందించారు. అనంతరం ఆలయ అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి స్వామివారి సన్నిధిలో దీపారాధన చేసి ప్రత్యేక అర్చనలో పాల్గొన్నారు.

**భక్తుల రద్దీకి సమగ్ర ఏర్పాట్లు :**

మహాశివరాత్రి సందర్భంగా రెండు ఆలయాల వద్ద భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. పోలీసు, రెవెన్యూ, ఆలయ సిబ్బంది సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా పర్చూరు ప్రాంతమంతా భక్తి భావంతో నిండిపోయింది. శివుని కటాక్షం ప్రజలందరికి లభించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆకాంక్షించారు. తొలుత ఎమ్మెల్యే ఏలూరికి నాయకులు, కార్యకర్తలు అభిమానులు స్వాగతం పలికారు. ఆలయాల వద్ద వేద పండితులు ఎమ్మెల్యే ఏలూరికి ఎదురేగి స్వాగతం పలికారు.

## శ్రీభ్రమరాంబ రామలింగేశ్వర స్వామి దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే ఇంటూరి



**వలేటివారిపాలెం ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వలేటివారిపాలెం పంచాయతీ లోని శ్రీ భ్రమరాంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఎమ్మెల్యే ఇంటూరికి వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద మంత్రోచ్చరణలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. బోలా శంకరుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అన్నదాన కార్యక్రమంలో ఆయన భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వలేటివారిపాలెం మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీ నరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకుమాని ఆంజనేయులు, పార్టీ నాయకులు గుత్తా మహేశ్వరరావు, వలేటి నరసింహం, కాకుమాని హర్ష, పరిటాల భాస్కర్, వలేటి మధు, గుత్తా తిరుపతయ్య, కొంకా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

7_7.qxd 2/16/2026 12:16 AM Page 1



## దోర్నాలలో శ్రీశైలం వెళ్లే భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**
మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తులకు శ్రీశైలం రోడ్డులో దోర్నాల శ్రీ ప్రేమ సాయి మందిరం వద్ద మార్కాపురం లక్కీ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీశైలం వెళ్లే భక్తులకు పులిహోర మజ్జిగ పంపిణీ చేశారు. శివస్వాములు శ్రీశైలం వెళ్లే ఇతర భక్తులు స్వచ్ఛమైన పులిహోర, చల్లని మజ్జిగ స్వీకరించి ఆనందం వ్యక్తం చేశారు. సామాజిక సేవ దృక్పథంతో నిర్వహించిన కార్యక్రమాన్ని పలువురు అభినందిస్తూ ఇలాంటి సేవలు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం లక్కీ షాపింగ్ మాల్ ప్రతినిధులు, సాయి భక్తులు సేవలందించారు.

## పొదిలి నిర్మామహేశ్వరస్వామిని దర్శించుకున్న ఎంపీ మాగుంట



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**
మహాశివరాత్రి సందర్భంగా పొదిలిలోని పార్వతి సమేత నిర్మామహేశ్వరస్వామిని ఆదివారం ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి టీడీపీ నాయకులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, సభ్యులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. వీరితో పాటు రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, ఏఎంసీ చైరనమన్ సయ్యద్ ఇమాంస, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ , టీడీపీ మాజీ కన్వీనర్ మీగడ ఓబుల్‌రెడ్డి, పొదిలి పోలేరమ్మ ఆలయ చైర్మన్ ముని శ్రీనివాసులు, తెలుగు యువత అధ్యక్షులు పోవూరి సురేష్, నాయకులు కాటూరి పెద్దబాబు, ఎర్రంరెడ్డి వెంకటేశ్వరరెడినడ, ఎస్ఎం భాష, షేక్ షబ్బీర్, షేక్ మౌలాలి, షేక్ కాశీం పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మార్కాపురం జిల్లా అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

### తిరుమణి శెట్టి కోటయ్య మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వైసీపీ ఇన్‌చార్జి బుర్రా



**లింగసముద్రం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**
మహాశివరాత్రి సందర్భంగా లింగసముద్రం మండలంలో తిరుమనిశెట్టి కోటయ్య గుడిలో మాజీ శాసనసభ్యులు, కందుకూరు వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణసేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్నిన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లింగసముద్రం ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, ప్రసాద్, కొండలరావు, అంజయ్య, మల్లిఖార్జున, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పాలన పక్కన పెట్టి జైలుకు ఎవరిని పంపాలని ఆలోచించేదే కూటమి ప్రభుత్వం



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**
పొదిలి నిర్మ మహేశ్వరస్వామి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. మాహాశివరానరతిసందర్భంగా స్వామివారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి చీర, సారే సమ్పించారు. దర్శన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పై పలు విమర్శలు చేశారు. ప్రభుత్వ తీరు భాగాలేదని తిట్టినోడికి సెంట్రల్ జైల్, కొట్టినోడికి స్టేషన్ బెయిల్ ఇస్తున్నారని ఆయన మండిపడ్డారు. పాలన పక్కన పెట్టి ఉదయం, సాయంత్రం ఎవరిని జైలుకు పంపాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్ధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, వైసీపీ నాయకులు కవి రమణారెడ్డి,వెంకటేశ్వర్లు, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి,కొనకనమిట్ల ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి,ఆర్యవైశ్య నాయకులు యక్కలి శేషగిరిరావు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

**- ఆలయాల వద్ద పోటెత్తిన భక్తులు**





**కొనకనమిట్ల, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**
మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని పలు శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఎదురాళ్లపాడు సంగమేశ్వర, అంబాపురం అంబ బాలత్రిపుర సుందరి దేవి ఆలయాల్లోమహాశివరాత్రి వేడుకలు అత్యంత భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. కొనకనమిట్ల, ఎదురాళ్లపాడు, సలనూతల బ్రహ్మణపల్లి ఆలయాల వద్దమధ్యాహ్నం అన్నదానకార్యక్రమం నిర్వహించారు. రాత్రి నృత్య కోలాటం, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొనకనమిట్ల- పుట్టువారిపల్లి రోడ్డు కూడలిలోని శ్రీరామ దూత క్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి.

## షాదీముబారక్‌లో ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు పిబ్రవరి 15,ప్రభాతవార్త**
కందుకూరుకు చెందిన షేక్ మహబూబ్‌బాషా తన కుమార్తె రుక్సానా సల్మాన్ వివాహమహోత్సవంకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఆహ్వానించారు. దీంతో ఆయన స్థానిక ఆలా వారి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహిస్తున్న వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## కందుకూరులో యాంకర్ సుమ సందడి



**కందుకూరు పిబ్రవరి 15,ప్రభాతవార్త**
ప్రముఖ బుల్లితెర నటి టీవీ యాంకర్ కనకాల సుమ ఆదివారం కందుకూరు వచ్చారు. ఈమె రాకతో పలువురు మహిళలు ఆమెను చూడడానికి ఎగబడ్డారు. ఇటీవల పట్టణంలోని కోవూరు రోడ్డులో "అన్నంగి సిల్క్స్" అనే షాపును ప్రారంభించారు. ఈ షాపు కందుకూరుకు చెందిన సుమ స్నేహితురాలైన అన్నంగి సుజాతకు చెందినది. ఈమె ఆహ్వానం మేరకు సుమ కందుకూరుకు విచ్చేసి అన్నంగి సిల్క్స్ షాపింగ్ మాల్‌లో సందడి చేశారు.

### సత్తాచాటిన రావిపాడు ఎడ్లజత



**కంభం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**
మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని చిన్న కంభం గ్రామంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో మార్కాపురం జిల్లా కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన పి రామయ్య ఎడ్ల జత 3 వేల అడుగుల దూరంలోకి ప్రథమ స్థానంలో నిలిచి రూ.30వేలను గెలుపొందినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కొమరోలుకు చెందిన కామూరు రమణారెడ్డికి చెందిన ఎడ్ల జత 2865 అడుగుల దూరంలాగి రెండవ స్థానంలో నిలిచి ద్వితీయ బహుమతి రూ.25వేలు, ప్రకాశం జిల్లా దర్శికి చెందిన ఉపేంద్ర చౌదరి ఎడ్లజత 2742 అడుగుల దూరంలోకి మూడవ స్థానంలో నిలిచి తృతీయ బహుమతి రూ.20వేలు,అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామానికి చెందిన పెద్ద కాశింవలిఎడ్ల జత 2,700 అడుగుల దూరంలోకి చతుర్థ బహుమతి రూ.15వేలు, అర్ధవీడు మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన సూరె రాంబాబు ఎడ్ల జత 2419 అడుగుల దూరంలాగి 5వ బహుమతి రూ.10వేలు, కడప జిల్లా పోరుమామిళ్ళ గ్రామానికి చెందిన శివరామన్న ఎడ్లజత 2402 అడుగుల దూరంలాగి ఆరవ బహుమతి రూ.7వేలు, గిద్దలూరు మండలం మోడం పల్లి గ్రామానికి చెందిన రాములు ఎడ్ల జత 2247అడుగుల దూరంలాగి ఏడవ బహుమతి రూ.5వేలు, గిద్దలూరు మండలం పొదలకుంటపల్లి గ్రామానికి చెందిన వంశీధర్ రెడ్డిఎడ్లజత 2116 అడుగుల దూరంలాగి 8వ బహుమతి రూ.3వేలను గెలుపొందినట్లు తెలిపారు.

## గుడ్లూరు శివాలయంలో ఎమ్మెల్యే పూజలు



**కందుకూరు పిబ్రవరి 15,ప్రభాతవార్త**
మహాశివరాత్రి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం గుడ్లూరులోని శ్రీగంగాపార్వతీ సమేత శ్రీ నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యంలేకుండా స్వామివారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పండుగను జరుపుకోవాలని, భోళాశంకరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## మండలంలో శైవ క్షేత్రాల్లో ఘనంగా ప్రత్యేక పూజలు





**రాచర్ల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**
మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శివ క్షేత్రాలలో భక్తులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని రామాపురం గ్రామ సమీపంలోగల శ్రీ సిద్ధి భైరవేశ్వర స్వామి ఆలయం, సత్యవోలు గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం, రాచర్ల గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, అక్కపల్లి గ్రామ సమీపంలోని శ్రీ కనక సురబేశ్వర ఎల్లమ్మ కోనల్లో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు శ్రీ సిద్ధి భైరవేశ్వర ఆలయంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి ఆయన చేత పూజలు చేయించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి ఆలయ ధర్మకర్త మదిరె గుండారెడ్డి, ఉపధర్మకర్త అన్నపురెడ్డి వెంకట నారాయణ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. శివరాత్రి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో బండలాగుడు పోటీలు, కోలాటం, నాటక ప్రదర్శన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

## ఎడ్ల బండ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల

**- ఎడ్లపోటీల్లో ప్రథమ విజేతగా నిలిచిన బొడిచర్ల ఎడ్లజత**



**రాచర్ల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**
మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని రామాపురం గ్రామంలో శ్రీ సిద్ధి భైరవేశ్వర ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో మార్కాపురం మండలం బొడిచెర్ల గ్రామానికి చెందిన తంతి నక్షత్రారెడ్డి ఎడ్లు తమ సత్తా చాటి రూ.50వేల ప్రథమ బహుమతిని అందుకున్నాయి. ఈ పోటీల్లో మొత్తం7జతలు ఎడ్లు పాల్గొనగా ద్వితీయ బహుమతి రూ.30వేలును బల్లికురవకు చెందిన సత్య కృష్ణ అజయ్ కుమార్ ఎడ్లుజత, తృతీయ బహుమతి రూ.20వేలను రాచర్ల మండలం జి కొత్తపల్లి గ్రామానికి చెందిన బొద్దు నారాయణరెడ్డి ఎడ్లు, చతుర్ధ బహుమతి రూ.10వేలను బేస్తవారిపేట మండలం జెసి అగ్రహారానికి చెందిన లక్ష్మీ మ్మ స్వాతి ఎడ్లు దక్కించుకున్నాయి. విజేతలకు దాతలు సహకారంతో బహుమతులు ప్రధానం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కోలాటం పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.15వేలు, రెండవ బహుమతి రూ.10వేలు, మూడవ బహుమతి రూ.5వేలు, నాల్గవ బహుమతి రూ.5వేలు దాతల సహకారంతో అందించినట్లు వారు తెలిపారు.

## మహాశివరాత్రి ఏర్పాట్ల నేపథ్యంలో పిజిఆర్ఎస్ రద్దు

**- జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రకటన**



**మార్కాపురం, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈ వారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. జిల్లాలో నిర్వహిస్తున్న పాకాల బీచ్ ఫెస్టివల్ విధుల్లో ప్రభుత్వ అధికారులు నిమగ్నమై ఉండటం, అలాగే మహాశివరాత్రి పర్వదిన ఏర్పాట్లలో బిజీగా ఉండటం, అదనంగా సోమవారం ఐచ్ఛిక సెలవు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. దూర ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం విజ్ఞప్తి చేసింది. తదుపరి తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

## శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాట్లు

**- భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన జిల్లా ఇంచార్జ్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు**





**త్రిపురాంతకం, ఫిబ్రవరి 15,ప్రభాతావార్త**
మహా శివరాత్రి పర్వదిన వేడుకల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర భద్రతా చర్యలు చేపట్టిన జిల్లా పోలీసులు దేవాలయాల వద్ద ప్రత్యేక నిఘా, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేశారు. భక్తులు పోలీసు సిబ్బందితో సహకరిస్తూ ఉత్సవాలను ప్రశాంత, సురక్షిత వాతావరణంలో జరుపుకోవాలని మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. త్రిపురాంతకంలోని శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానం మరియు శ్రీమత్ బాలా త్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి మహోత్సవాలు, అలాగే 17వ తేదీన నిర్వహించనున్న రథోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదివారం అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఆలయ పరిసరాలు, ప్రవేశ మార్గాలు, క్యూలైన్లలో ఏర్పాటు చేసిన భద్రతా మరియు బందోబస్తు చర్యలను పరిశీలించారు. అదేవిధంగా దేవాలయం, రథం వద్ద ఉన్న భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. దేవాలయం వద్ద భక్తులతో ఎస్పీ మాట్లాడి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఆలయ పరిసరాలను సందర్శించి, దర్శనానికి వచ్చే భక్తులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం క్యూలైన్లను క్రమబద్ధంగా నిర్వహించాలని, ఆలయం లోపల భక్తుల ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. దర్శనార్థం వచ్చే భక్తుల వాహనాలు నిలిపే పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను క్రమపద్ధతిలో పార్క్ చేసేలా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా సమర్థవంతంగా క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. ప్రయాణికులు ,వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన బందోబస్తు నిర్వహించి, ప్రశాంత వాతావరణంలో శివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. త్రిపురాంతకంలో మహాశివరాత్రి ఉత్సవాలు మరియు రథోత్సవాలు నిర్వహించబడుతున్నాయని, పండుగ వేడుకలు, ఊరేగింపులు ప్రశాంతంగా మరియు సజావుగా కొనసాగేందుకు పోలీసు సిబ్బందితో కలిసి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. పూర్తి స్థాయి బందోబస్తుతో అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. మంగళవారం నిర్వహించనున్న రథోత్సవం సందర్భంగా రూట్ మ్యాప్‌ను పరిశీలించి, సిబ్బందికి కీలక సూచనలు అందజేశామని తెలిపారు. రథోత్సవం సమయంలో భక్తులు తోపులాటలకు పాల్పడకుండా, ప్రశాంత వాతావరణంలో పండుగ వేడుకలు ఘనంగా జరిగేలా అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. దేవాలయం పరిసరాలు, రథోత్సవ మార్గంలో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా సంతమాగులూరు అడ్డ రోడ్డు వద్ద కోటప్పకొండకు పోయే మార్గము, ట్రాఫిక్ ను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి, అక్కడ ఉన్న సంతమాగులూరు సిఐ కె వెంకటరావు, ఎస్సై యం పట్టాభిలకు పలు సూచనలు తెలియజేశారు. ట్రాఫిక్ సమస్య లేకుండా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట మార్కాపురం డిఎస్పి యు నాగరాజు, మార్కాపురం సిఐ సుబ్బారావు, త్రిపురాంతం సీఐ జి అస్సాన్, త్రిపురాంతకం ఎస్సై శివబసవరాజు, కంభం ఎస్సై శివకృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు కిటకిటలాడిన శివాలయాలు





**తాళ్లూరు, ఫిబ్రవరి15,ప్రభాతవార్త**
మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆదివారం ఉదయం నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలం లోని బొద్దికూరపాడు, శివరాంపురం, లక్కవరం, మాధవరం, తాళ్లూరు, గుంటి గంగమ్మ వద్ద శివాలయాల్లో తెల్లవారు జామున నుంచే అభిషేకాలు,అర్చనలు చేశారు. ఆలయాల్లో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. బొద్ది కూరపాడులో శ్రీ గంగా పర్వత వర్ధిని సోమేశ్వర స్వామి దేవాలయంలో, గుంటి గంగ భవాని వద్ద ఉన్న శ్రీ పార్వతి సమేత మల్లికార్జున స్వామి( బ్రహ్మ సూత్రం),లక్కవరం శివాలయం, శివరాంపురంలో గొల్ల బావి వద్ద ఉన్న శివాలయం లోభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గుంటి గంగ సన్నిధి లో ఉన్న శ్రీ మల్లికార్జున స్వామికీ పూజారి నడంపల్లి ప్రకాష్ రావు శర్మ శివునికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కాగా గుంటి గంగ లో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ నిర్వాహకులు సన్నే బోయిన వీరాంజనేయులు, భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాధవరంలో గంగా పార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామి కి పూజారి బెల్లంకొండ శ్రీనివాస్‌శర్మ అభిషేకాలు, శివపార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద ఆలయ ధర్మకర్త ఐ వి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. లక్కవరం లో కృష్ణ స్వామి ఆధ్వర్యంలో మహా యజ్ఞం నిర్వహించారు .

## పోటెత్తిన శివాలయాలు - మార్మోగిన శివనామస్మరణ





**కురిచేడు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**
మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా మండలంలోని శివాలయాలన్నీ ఆదివారం నాడు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచే భక్తులు శివాలయాలకు వెళ్లి స్వామివారి దర్శనార్థం బారులు తీరారు. మండల కేంద్రమైన కురిచేడులోగల శ్రీజ్ఞానప్రశూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర దేవాలయంలో వేకువజామునుండే ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రి స్వామివారి కళ్యాణం, సాయంత్రం ఊరేగింపు తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్దలతో నిర్వహించారు. మండలంలోని పడమరగంగవరంలో వేంచేసి ఉన్న శ్రీచెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో దేకనకొండలోని శివాలయంలో, గంగదొనకొండలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో, కురిచేడులోని బ్రహ్మంగారి దేవాలయంలో శివరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. గంగవరంలో రాత్రి పూట భజనలు, కోలాటాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## శివనామస్మరణతో మార్మోగిన బైరవకోన, మిట్టపాలెం క్షేత్రాలు







**సీఎస్‌పురం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**
మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం బైరవకోన, మిట్టపాలెం గ్రామంలోని శ్రీ నారాయణస్వామి ఆలయాలతో పాటు మండలంలోని శైవ క్షేత్రాలు ఆదివారం శివనామస్మణతో మార్మోగాయి. ప్రసిద్ధి బైరవకోన క్షేత్రానికి, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప, బాపట్ల, కృష్ణా, గుంటూరుజిల్లాల నుండిభక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా బైరవకోన ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించగా పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జలపాతం వద్ద నీటిలో సందడిచేశారు. అదే విధంగా నారాయణస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

**బైరవకోనలో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ఉగ్ర, దామచర్ల, డాక్టర్ చెవిరెడ్డి, డాక్టర్ దద్దాల ప్రత్యేక పూజలు :**
మహాశివరాత్రి సందర్భంగా బైరవకోన క్షేత్రానికి ఎంపీ మాగుంట శ్రీనివాసరెడినడ, ఎమ్మెల్యే, టీడీపీ అధ్యక్షులు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కనిగిరి నియోజకవరనగ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌లు వచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ చైరనమన్ శ్యాంసుందర్ రాజు, ఈవో వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికి పూజలు అనంతరం వారిని ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బైరవకోన, మిట్టపాలెం రెడ్ల సంఘం, దుగినగరెడ్డి సుబ్బమ్మ అన్నదాన సత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఇన్‌చార్జి దద్దాల ప్రారంబించారు. ముందుగా డాక్టర్ దద్దాల మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి, రాజుపాలెం సంగమేశ్వర ఆలయాల్లో స్థానిక నాయకులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. బైరవకోన, మిట్టపాలెం ఈఓలు డి.వంశీకృష్ణారెడినడ, శ్రీగిరి రాజు నరసింహబాబు, ఆలయ చైరనమన్‌లు ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, కొమ్మినేని సమకూర్చారు. డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, సీఐ మాకినేని శ్రీనివాసరావు, ఎం.రాజేష్ కుమార్, ఎస్సైలు ఎం.వెంకటేశ్వర నాయక్, కట్టా అనూక్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు. క్షేత్రానినన ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీడీఓ, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరెడ్డిలు సందర్శించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ బోయళ్ళ నారాయణరెడ్డి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బొబ్బూరి రమేష్, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, ఎన్‌సీ మాలకొండయ్య, పార్టీ మండల అధ్యక్షులు పాలుగుళ్ల మల్లిఖార్జునరావు, గంగసాని హుస్సేన్‌రెడ్డి, జడ్పీటీపీ మేక శ్రీనివాసులు, గుంటక తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ లు దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, టీయూసీ జిల్లాఅధ్యక్షుడు మితికాల గురవయ్య, దుగ్గిరెడ్డి జయరెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, రామచంద్రారెడ్డి, పి.ఆదినారాయణ, మైనార్టీ సెల్ నాయకులు షేక్ బుజ్జి, ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, చెరుకుపల్లి రాధాకృష్ణారెడినడ, ఎం.పెద్దన్న, బి.దేవరాజ్, బసివి చంద్రశేఖర్, పందిళ్ల నాగమణి, యల్లయ్య పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా త్రిపురాంతకస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు





**సంతనూతలపాడు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని గంగా పార్వతి సమేత త్రిపురాంతక స్వామి వారి ఆలయంలో ఆదివారం నాడు ఘనంగా మహాశివరాత్రి వేడుకలు జరిగాయి. ఎండోమెంట్ దాతలు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సోమరాజుపల్లి బుజ్జిబాబు శర్మ,అర్చక బృందం పృధ్వి తదితరులు ఈ సందర్భంగా శివపార్వతులకు మహాశివరాత్రిలో భాగంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివాళ్లకు సంతనూతలపాడు కేంద్రంలో గ్రామోతనసవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉభయ దాతలుగా శిఖాకొల్లి కోటంశెట్టి సన్స్, గ్రందె సంజీవరావు, కలువా నాగ ప్రసాద్, కుటుంబీకులు వ్యవహరించారు. ఈ వేడుకలను ఎండోమెంట్ ఈవో ఎన్.నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ శిఖాకొల్లి ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు, దాతలు పర్యవేక్షించారు. సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, సచివాలయాల మహిళా పోలీసులు ఆర్జీ యూకేటీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థినిలు పర్యవేక్షించారు. ఆదివారం రాత్రిఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబు శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు లింగోద్భవ పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. మండలంలోని పేర్నమిట్ట రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అర్చకులు ఎస్.అనిల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఎండోమెంట్ ఈవో ప్రసన్న కుమారి,దాతలు ఈ వేడుకలను పర్యవేక్షించారు. మండలంలోని మద్దులూరు, చిలకపాడు, మైనంపాడు, ఎండ్లూరు, మంగమూరు, ఎనికపాడు, తదితర గ్రామాల్లో ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా కాశీ విశ్వనాథ స్వామి కళ్యాణ మహోత్సవం



**సింగరాయకొండ, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు నదులు, సముద్ర స్థానాల ఆచరించి శివాలయాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పాత సింగరాయకొండలోని శ్రీ కాశీ విశ్వనాథ స్వామి దేవస్థానంలో ప్రత్యేక అభిషేకాలు, రుద్రపారాయణాలు, మహామంగళ హారతులు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంతా ఓం నమః శివాయ నినాదాలతో మార్మోగింది. రాత్రి కి విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథ స్వామి వారికి కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథ స్వామి కి గ్రామోత్సవం నిర్వహించారు. పాకలలోని గంగా సమేత అమరలింగేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలు తో అలంకరించి విశేషా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రివేళ జాగారం నిర్వహిస్తూ భజనలు, కీర్తనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శివరాత్రి వేడుకలతో మండలంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## నియోజకవర్గంలో నేడు చింతలపూడి పర్యటన

**అద్దంకి , ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ సోమవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెంలో కూటమి నాయకుల దాడిలో గాయపడిన పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి మాతృమూర్తి పరామర్శించనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు జె.పంగులూరు మండలం కొండమంజులూరు గ్రామంలో వైసిపి నాయకుల జంపాని రవిబాబు మాతృమూర్తి నాగేంద్రమ్మ దశదిన కార్యక్రమంలో చింతలపూడి పాల్గొంటారని ఆయన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

### శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా దద్దాల ప్రత్యేక పూజలు



**కనిగిరి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కనిగిరి మండలం నందనమారెళ్లలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణల మధ్య వేద ఆశీర్వచనంఅందజేయగా, అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను సమర్పించారు. ఆలయకమిటీ సభ్యులు దద్దాలను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. మహా శివరాత్రి పర్వదినాన పరమశివుని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, భోళాశంకరుడు ప్రతి కుటుంబానికి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు ప్రసాదించాలని దద్దాల నారాయణ యాదవ్ మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్, మడతల కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, ఒకే రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడినడ, ఆవుల భాస్కర్‌రెడ్డి, పచ్చ వెంకట సుబ్బయ్య చౌదరి, గుంటూరి వెంకటేశ్వర్లు చౌదరి, అల్లాటిపల్లి ప్రసాద్‌రెడినడ, మద్ది తిరుపతయ్య, శ్యామల సాంబిరెడ్డి, బత్తుల మాలి, రామనబోయిన శ్రీనివాసులు, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, మార్తల వెంకటేశ్వర్లు, మార్తల శివ కుమార్‌రెడ్డి, సిగ కృష్ణారావు, మిట్ట రమేష్‌రెడ్డి, గులుగులూరి ఆదిరెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, మేకల మాల్యాద్రి, పరుచూరి రమేష్‌గౌడ్, శీలం సుదర్శన్,అత్యల ఇసాక్, ఆంద్ర వెంకటరావు, మేకల వెంకటేశ్వర్లు,కాసుల బాలయ్య,మంత్రి గురవయ్య,యాళ్ల కృష్ణారెడ్డి, బకనక దేవదానం, బక్క భాగ్యరాజ్,బక్క జాన్సన్,మూలే శ్రీనివాసులురెడ్డి, కోటిరెడ్డి, మడతల శివ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మహాశివరాత్రి వేడుకల సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ కనిపించగా, భక్తిశ్రద్దలతో పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

## వెలుగొండ ప్రాజెక్టు ప్రాంత ప్రజలకు అన్యాయం

**- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సయనయద్ యాసిన్**



**కనిగిరి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

ఈ బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్టు ప్రాంత ప్రజలకు అన్యాయం జరిగిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ యాసిన్ నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు నేను ప్రారంభించాను నేను 2026 జూన్‌లో పూర్తి చేస్తాను అని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు కేటాయింపులో అన్యాయం చేశారన్నారు. మొత్తంఈ ప్రాజెక్టు పూర్తికి రూ.4,500 కోట్లు కావాల్సి ఉండగా ఇప్పుడు రూ.2వేల కోట్లు కేటాయిస్తే ప్రాజెక్టు సొరంగాలు, కాలువలు పూర్తి చేసి ఆగష్టు నుండి శ్రీశైలంకు వచ్చే వరద నీటితో ప్రాజెక్టు నింపవచ్చు. ఈ బడ్జెట్‌లో కంటి తుడుపుగా రూ.492 కోట్లు కేటాయించి జూన్‌కు పూర్తి చేసి నీళ్లు ఇస్తామంటే జనం నమ్మేస్థితిలో లేరు. కాబట్టి బడ్జెట్ అంచనాలు సవరించి ప్రాజెక్టుకు తక్షణమే రూ.2వేలు కోట్లు కేటాయించి వెనుకబడిన మార్కాపురం జిల్లా ప్రజలకు న్యాయం చేయాలని సయ్యద్ యాసిన్ డిమాండ్ చేశారు.

### మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



**కనిగిరి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కనిగిరి పట్టణంలోని కొండపై వెలసిన శ్రీ పార్వతి సమేత విజయ మార్థండేశ్వరస్వామి దేవాలయంలో కనకపట్టణంలోని వెలసిన శ్రీశ్రీశ్రీ సత్యానంద భారతి స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పరమ శివుడి లింగోద్భవానికి ప్రతీకగా జరుపుకునేఈ పండుగ.. పరమభక్తికి నిదర్శనమని, మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఆచరించే ఉపవాసం, జాగరణ నిష్టా గరిష్టతను చాటుతాయన్నారు. మహాశివరాత్రి పర్వదినాన ఉపవాసం, జాగరణ చేసే భక్తులు, భక్తి శ్రద్దలతో శివార్చన, పండుగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కనిగిరి పట్టణ ప్రజలందరిపై ఆ పరమశివుడి అనుగ్రహం ఉండాలని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాగిచర్ల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ దేవకి సత్యావతి, బొట్టు శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, విజేత కళాశాల అధినేత అరుణోధర్ మాల్యాద్రిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నారాయణ, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు

**- ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే ఉగ్రకు శుభాకాంక్షలు తెలిపిన నాగార్జున యాదవ్**



**కనిగిరి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నందనమారెళ్ళలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కనిగిరి మున్సిపాలిటీ పట్టణ కార్యదర్శి సీహెచ్ నాగార్జున యాదవ్ ఆలయ ప్రాంగణంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. పర్వదిన సందర్భంగా నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోరుతూ ప్రార్థనలు చేశారు. ఆలయంలో భక్తుల రద్దీ కనిపించగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు

**- శివపార్వతుల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించిన కొప్పరపు సత్యాలు - పరమేశ్వరి దంపతులు**

**కనిగిరి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్దలతో పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఉదయం 9గంటలకు గణపతి, నవగ్రహ సమేత రుద్ర, మృత్యుంజయ హోమాలు వేద మంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. హోమాలలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దేవస్థానం కమిటీ చైరనమన్ కొప్పరపు సత్యాలు, పరమేశ్వరి దంపతులు శివపార్వతుల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలతో మార్మోగింది. అనంతరం లింగోద్భవ కాలం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు ఉపవాస దీక్షలతో శివనామస్మరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల వేదిక తాత్కాలిక రద్దు



**మార్కాపురం, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈ వారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రకటించింది. జిల్లాలోని ప్రభుత్వ అధికారులు ప్రస్తుతం మహాశివరాత్రి పండుగ ఏర్పాట్లలో నిమగ్నమై ఉండడం, అలాగే సోమవారం ఐచ్ఛిక సెలవు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. దూర ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం ఎస్పీ కార్యాలయానికి విచ్చేసే అర్జీదారులు ఈ మార్పును గమనించాలని డీఎస్పీ నాగరాజు తెలిపారు. ప్రజలు తదుపరి సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

# శ్రీశైలంలో శివపార్వతుల కళ్యాణం

**- కనులారా తిలకించేందుకు కధం తొక్కిన భక్తులు - లక్షలాది మంది భక్తులతో జనసంప్రదమైన క్షేత్రం**








**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

శ్రీశైలమహాక్షేత్రంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శివపార్వతుల దివ్య కళ్యాణోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. శ్రీశైలం భక్తులతో నిండిపోయి జనసంద్రమై ఆధ్యాత్మిక కాంతులతో కళకళ లాడింది. వేదఘోషాల మధ్య అర్చకులు సాంప్రదాయ బద్దంగా శాస్త్రోక్త పద్ధతిలో కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. హర హర మహాదేవ శంభో వంటి భక్తుల నినాదాలతో భక్తి పరవశమై శ్రీశైలం మార్మోగింది. దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని కళ్యాణోత్సవాన్ని తిలకిస్తూ తమజీవితాలు ధన్యం అయ్యాయని భావోద్వేగంతో తెలిపారు. ప్రధానంగా మహిళలు, వృద్దులు, పిల్లలు, పురుషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శివపార్వతుల కళ్యాణాన్ని దర్శించడం ద్వారా కుటుంబ సౌఖ్యము, ఐశ్వర్యము కలుగుతాయని భక్తులువిశ్వసిస్తారు. ఈ నేపధ్యంలో కళ్యాణోత్సవం భక్తివైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో ఘనంగా భక్తిశ్రద్దలతో జరిగింది. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పోలీసులు భద్రత చర్యలను కట్టు దిట్టం చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

## అద్దంకి రైల్వే లైన్ కొరకు చర్చిలలో ప్రార్థనలు






**అద్దంకి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

అద్దంకికి రైల్వే లైన్ కొరకు అన్ని మతాల వారి మద్దతు కోరుతూ అద్దంకి రైల్వే సాధన సమితి వారు నిర్వహించిన "అద్దంకి కి రైలు కొరకు దువా ", రైల్వే లైన్ కొరకు శింగరకొండ పాదయాత్ర" కార్యక్రమాలు విజయవంతమైన విషయం విదితమే. ఈ క్రమంలో ఆదివారం అద్దంకిలోనీ పలు చర్చిల్లో అద్దంకికి రైల్వే లైన్ కొరకు ప్రార్థనలు చేయడం జరిగింది. పాస్టర్లు, అద్దంకి అభివృద్ధికి రైలు మార్గం ఎంతో అవసరం అని వివరించి ప్రతిరోజూ అద్దంకి రైల్వే సాధన సమితి తరుపున సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిట్టల మధుసూదనరావు , మానికొండ రవిశంకర్, కత్తి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో శివాలయంలో ప్రసాదాలు పంపిణీ



**అద్దంకి ,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**

పట్టణంలోని గాజులపాలెం వద్ద గల శివాలయంలో రోటరీ క్లబ్ సింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుండి పొంగలి ,పులిహార ,దద్దోజనం ప్రసాదాలుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శి, ట్రజరర్ శివధర పూర్ణచంద్రరరావు, అళహరి హరి ప్రసాద్, తమ్మనశ్రీనివాసరావు, సభ్యులు విరాళాలు అందించడం జరిగింది. రోటరీ సభ్యులు పి ఎల్ వి నరసింహారావు,దేవపాలన,జ్యోతి చంద్రమోళి మల్లాది శ్రీనివాసరావు, కరిరామయ్య,పువ్వాడ రామకోటేశ్వరరావు, వుటుకూరు రామ కోటేశ్వరరావు,పి కృష్ణారావు,వాణి,స్నేహలత, గూడ మహాలక్ష్మీరెడ్డి, పసుపులేటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మాటల్లో మహా సంపద.. చేతల్లో పేదరికం

**- బడ్జెట్‌పై అశోక్ కుమార్ ధ్వజం**



**అద్దంకి, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**

అద్దంకి వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ బడ్జెట్ "మాటల్లో మహా సంపద.. చేతల్లో పేదరికం" అన్నట్లుగా ఉందని ఆయన అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించిందని ఆయన ఆరోపించారు. నెలకు 1500 ఇస్తామన్న ఆడబిడ్డ నిధికి కేటాయింపులు సున్నా అని, నిరుద్యోగులకు ఇస్తానన్న భృతి సున్నా అని 50 ఏళ్లు నిండిన ఎస్.సి.ఎస్టి, బిసిలకు పెన్షన్లు, కొత్త పెన్షన్ల ఊసే లేదన్నారు. కేంద్రంతో సంబంధం లేకుండా 20వేలు ఇస్తామని నమ్మబలికి, ఇప్పుడు కనీసం కేంద్రం వాటాతో కలిపి కూడా ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదు అన్నారు. అమ్మ ఒడి, ఉచిత గ్యాస్ పథకాల్లో భారీగా కోతలు విధించారని మండిపడ్డారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నం విఫలమైందని, వాటిని ప్రభుత్వ పరంగా ఎలా నడపాలో బడ్జెట్‌లో స్పష్టత లేకపోవడం శోచనియం అన్నారు. పేదలకు ప్రాణాధారమైన ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాలను గత రెండేళ్లుగా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. "మొత్తం బడ్జెట్‌లో సంక్షేమానికి కేటాయించింది కేవలం 17శాతం మాత్రమే. కానీ రాష్ట్ర అప్పులకు, వడ్డీలకు కడుతున్నది 18శాతం అంటే సంక్షేమం కంటే అప్పుల వడ్డీలకే ఎక్కువ ఖర్చు చేస్తున్నారు అన్నారు. అసెంబ్లీని దేవాలయంగా భావిస్తామని, కానీ అక్కడ సూపర్ సిక్స్ హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. అలాగే, అసెంబ్లీలో అసభ్యకర వీడియోలు పంపిన వారిని కఠినంగా శిక్షించి, సభ పరువు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ బడ్జెట్ కేవలం ప్రజలను భ్రమల్లో ఉంచడానికే తప్ప, సామాన్యుడికి చేకూరే లబ్ధి ఏమీ లేదని డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి స్పష్టం చేశారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇరువురికి గాయాలు





**బల్లికురవ , ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

అద్దంకి బల్లికురహదారిలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇరువురు యువకులు పంట కాలవలో పడిపోయి తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాలలోకెళితే, చీమకుర్తికి చెందిదార సల్మాన్, ఒరిస్సా కు చెందిన జనప్రదీప్ ఇరువురు స్నేహితులు. వీరు కోటప్పకొండ తిరుణాల వెళ్లేందుకు ఆదివారం సాయంత్రం చీమకుర్తి నుండి బయలుదేరారు. మండలంలోని అంబటిపూడి చెరువు సమీపంలోమూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి పంట కాలములో పడిపోయారు. సమాచారం అందుకున్న బల్లికురవ 108 సిబ్బంది ఈఎంటి ,అశోక్ పైలెట్ రామంజి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అనంతరం ఇరువురిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గుగ్గిళ్ళు, జావ,మజ్జిగ పంపిణీ





**అద్దంకి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహాశివరాత్రి సందర్భంగా వాసవి వనిత క్లబ్ పిఎస్‌టి మెంబర్స్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు మహాశివరాత్రి సందర్భంగా వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో అద్దంకి భవాని సెంటర్లో గల వెయ్యి స్తంభాల గుడిలో వచ్చిన భక్తులకు శనగ గుగ్గిళ్ళు, రాగి జావా, మజ్జిగ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ నాగలక్ష్మి, సునీత, సుజాత, ఆఫీసర్ ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, వాసవి వనిత క్లబ్ సభ్యులు జయశ్రీ,రాణి, దేవి సునీత, వేంపాడు జ్యోతి, వాసవి సేవా సభ్యులు ఈ సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహాయపడిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## కమతేశ్వరాలయంలో శివపార్వతుల కళ్యాణం



**అద్దంకి , ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలోని వేంచేసియున్న కాళికా సమిత కమటేశ్వరస్వామి దేవాలయం లో శివపార్వతుల కళ్యాణం జరిగినది. ఈ కార్యక్రమం దేవస్థాన చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రకాశం జిల్లా సుబ్రహ్మణ్య సంఘ అధ్యక్షులు శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షులు ఆళ్లగడ్డ వీర సుందర చారి, అద్దంకి పట్టణ అధ్యక్షులు అనంత మురళీమోహన్ రావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బొప్పూడి వీరప్పయ్య, శివ భక్తులు పాల్గొన్నారు.

## మణికేశ్వర ఆలయంలో జడ్జి పూజలు



**అద్దంకి , ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహాశివరాత్రిని పురస్కరించుకొని మణికేశ్వరం శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయాన్ని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి. అఖిల కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### కోటప్పకొండలో స్వామివారికి పట్టు వస్త్రాలు బహుకరించిన మంత్రి గొట్టిపాటి







**అద్దంకి, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తరపున కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి పట్టు వస్త్రాలను ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ బహుకరించారు. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలు, సౌభాగ్యం,శాంతి,సంమృద్ది కోసం స్వామి ఆశీస్సులు కోరుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, చీఫ్ విప్ జీవి ఆంజనేయులు, స్థానిక నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు.

### కోటప్పకొండకు వెళ్లే భక్తులకి ఉచిత మహాప్రసాద కార్యక్రమం





**సంతమాగులూరు, ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**

మండలంలోని పుట్టవారిపాలెం గ్రామం అడ్డరోడ్‌లోని కోటయ్య స్వామి మొదటి పాదం దగ్గర కులమతాలకు అతీతంగా కోటప్పకొండ వెళ్ళు భక్తులకు సర్పంచ్ మరియు గ్రామస్తుల సహకారంతో సుమారు 2వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అద్దంకి, వినుకొండ, రొంపిచర్ల సమీపంలో నుండి వెళ్లే భక్తులు అడ్డరోడ్ సెంటర్‌లో వున్న కోటయ్య పాదాలు దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురుయాదవ్, గ్రామ పెద్దలు,యువకులు మరియు స్థానిక ఎస్.ఐ. పట్టాభి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండుగగా శివ పార్వతుల నగరోత్సవం

**- ఘనంగా పూజలు పెద్ద ఎత్తున అన్న ప్రసాదాల పంపిణీ**

**- నేడు రధోత్సవ కార్యక్రమం**



**అద్దంకి , ఫిబ్రవరి 15,ప్రభాతవార్త**

మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా అద్దంకినగరంలో శివపార్వతుల నగరోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. మొదట భాస్కర్ సప్లైయిర్స్ అధినేత గార్లపాటి శ్రీనివాసరావు గృహం నుండి ఆలంకరించ బడిన అమ్మవారిని పూజల అనంతరం రామలింగేశ్వరావు వారి గృహం వద్దకు ఊరేగింపుగా స్వామి వారి వద్దకు తరలించారు. అక్కడ నుండి స్వామి వారిని అమ్మవారిని రామలింగేశ్వరరావు గృహం వద్దనుండి అమ్మవారు, స్వామి వారిని నగరోత్సవంగా ప్రధాన వీధిలో ఊరేగింపుగా ఆలయానికి తరలించారు. మధ్యలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆనవాతీ ప్రకారం మున్సిపల్ అధికారులు, పాలకమండలి సంయుక్తంగా స్వామి వారికి పట్టు వస్త్రాలను బహుకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సమీపంలోని సుబ్బారావు కుటుంబసభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులతో కూడిన సారేను బహుకరించారు. అత్యంత భక్తి శ్రద్దలతో భక్తులు ఉత్సవంగా స్వామి వారిని పాతశివాలయం వరకు నగరోత్సవంగా తరలించారు. అనంతరం ఆలయంలో స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణంలో రామలింగేశ్వరరావు దంపతులు, గార్లపాటి శ్రీనివాసరావు శివకుమారి దంపతుల తోపాటు పలువురు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వద్ద 5 వేల మందికి పైగా అన్న ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం 3 గంటలకు స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు. గార్లపాటి వంశస్థులతోపాటు పలువురు భక్తులు రథాన్ని అధునీకరించేందుకు పెద్ద సంఖ్యలో విరాళాలను అందజేశారు. ఆమేరకు రథాన్ని కూడ రథోత్సవం కొరకు సిద్దం చేశారు. ఇది ఇలా వుండగా విద్యుత్‌శాఖ అధికారులు కూడ రథోత్సవాన్ని పురస్కరించుకొని విద్యుత్ లైన్‌లను ఆధీకరించే పనులను కూడ రెండు రోజుల క్రితమే పూర్తిచేశారు. ఈ రథోత్సవాన్ని విజయవంతం చేసేందకు, ఆలయ పాలకమండలితోపాటు పలు శాఖల అధికారులు, తగిన ఏర్పాట్లను కూడ చేశారు.





